క్లుప్తంగా

నేడు మండల సమావేశం

కిర్లంపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ తోట రవి సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సత్కారం



ఏలేశ్వరం డిపో మేనేజర్ సత్యనారాయణను సత్కరిస్తున్న బీసీ కమిటీ సభ్యులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణను సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఆర్టీసీ డిపో ఉద్యోగుల బీసీ కమిటీ ఆధ్వర్యంలో మేనేజర్ సత్యనారాయణను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని బీసీ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో బీసీ వేల్ఫేర్ రాష్ట్ర కోశాధికారి బీమన సూరిబాబు, డిపో కార్యదర్శి కేఆర్ బాలు, టీడీ మూర్తి, కేటీ మూర్తి, ఎస్ఆర్ బాబు, జీవీ రామారావు పాల్గొన్నారు.

వీధికుక్కల సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

రౌతులపూడి: గ్రామాల్లో విపరీతంగా పెరిగిపోయిన వీధికుక్కల సంచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీహెచ్‌సీలో చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ బి.సౌమ్య మైకేల్ సూచించారు. స్థానిక సీహెచ్‌సీలో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. కుక్క కాటు వల్ల వచ్చే రాబిస్ వ్యాధి నివారణకు పలు సూచనలు చేశారు. రౌతులపూడి సీహెచ్‌సీలో గతేడాది నవంబర్‌లో 61, డిసెంబర్‌లో 98, ఈ ఏడాది జనవరిలో 92, ఫిబ్రవరిలో ఇప్పటివరకూ 35 కుక్కకాటు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. కుక్క కరిచినా, రెక్కినా (గీచడం) తప్పనిసరిగా యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. వ్యాక్సిన్‌తో పాటు కుక్క కాటు వద్ద ఇమ్యునోగ్లోబలిన్ ఇంజెక్షన్ వేయించుకోవాలన్నారు. యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



ఏలేశ్వరంలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణరావు

ఏలేశ్వరం: పట్టణంలో పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలని రాజమహేంద్రవరం రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మిన్స్ట్రేషన్ ఎంవీవీ సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. పట్టణంలో పలు ప్రాంతాల్లోని పారిశుధ్యాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు, డ్రైన్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం సచివాలయాలను పరిశీలించి సిబ్బంది పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ కొండలరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

గోకవరం: క్షయ (టీబీ) వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ సూచించారు. టీబీ పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక కేవీఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ పీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టీబీ వ్యాధి లక్షణాలు, పరీక్షలు, చికిత్స విధానంపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు బాబూరావు, అబ్బులు, రాంబాబు, హెల్త్ అసిస్టెంట్లు పవన్, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవీ రావు మృతి ఆర్టీసీకి తీరని లోటు

గోకవరం: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శి వైవీ రావు అకాల మరణం ఆర్టీసీకి తీరని లోటు అని ఈయూ చీఫ్ ఎగ్జిక్యూటివ్ పైడిమళ్ల లక్ష్మణ్‌రావు అన్నారు. గోకవరం ఆర్టీసీ డిపో ఆవరణలో సోమవారం వైవీ రావు సంతాప సభ నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్టీసీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈయూ అధ్యక్ష, కార్యదర్శులు అక్కిరెడ్డి కృష్ణ, ప్రగడ ప్రసాద్, శ్రీను, ఆర్‌బీ దొర, దేముడు శ్రీను, ఎన్ఎంయూ నాయకులు మేడా మురళీ, వైఎస్సార్ యూనియన్ నాయకుడు జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

కర్షకా.. దిగులు లేదిక

- గ్రామాల్లో చురుగ్గా ఈ-క్రాప్ నమోదు
- ఈ-పంటతో బహుళ ప్రయోజనాలు
- రైతులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం



ఎ.కొత్తపల్లిలో వరి పంటకు ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

తొండంగి: రైతులకు పంటల సాగు భారంగా మారుతున్న తరుణంలో వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. రైతు భరోసా, రాయితీపై విత్తనాల సరఫరా, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలకు రుణాలు, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ సాగుపై రైతులను ప్రోత్సహిస్తోంది. ఖరీఫ్, రబీలో రైతులు పండించిన వరి పంటను ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తుంది. కాగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు ఈ-క్రాప్ నమోదును ప్రవేశపెట్టింది. రైతులు తాము సాగు చేసిన పంటలను ఆర్బీకేల ద్వారా ఆన్‌లైన్లో ఈ-క్రాప్ నమోదు చేసుకుంటే వారికి అన్ని ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందుతాయి. పంటలకు బీమా వర్తిస్తుంది.

ఈ-క్రాప్ నమోదుతో కలిగే ప్రయోజనాలు

గతంలో రైతులు, కౌలు రైతులు సాగు చేసిన పంటలను, వాటి దిగుబడులను రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది నామమాత్రంగా నమోదు చేసేవారు. దీంతో కచ్చితమైన సమాచారం అందుబాటులో ఉండేది కాదు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ట్యాబ్‌ల ద్వారా రైతులు సాగుచేసిన పంటల సమాచారాన్ని సేకరిస్తున్నారు. ముఖ్యంగా రైతులు సాగు చేసిన పంటలకు బీమా వర్తించడంతో పాటుగా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి పంట నష్ట పరిహారం అందుతుంది. అలాగే రైతులు సాగు చేసిన పంటలను ప్రభుత్వానికే విక్రయించుకోవచ్చు. ప్రభుత్వం రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసిన ధాన్యానికి గిట్టుబాటు ధరను అందిస్తుంది. పంటల సాగుపై కచ్చితమైన సమాచారం అందుబాటులో ఉంటుంది. రైతులు ఏయే పంటలను సాగు చేస్తున్నారు, వాటికి అవసరమైన విత్తనాలు, ఎరువులు తదితర పూర్తి సమాచారం లభిస్తుంది.

ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ ఇలా...

ప్రభుత్వం అన్ని గ్రామాల్లోనూ సచివాలయంతో పాటు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, గ్రామ రెవెన్యూ అధికారులు సమన్వయంతో క్షేత్ర స్థాయిలో పంటలు సాగు చేసిన ప్రాంతానికి వెళ్లి రెవెన్యూ రికార్డులు, సర్వే నంబర్లు, రైతులు వివరాలు ఆధారంగా ఎంత విస్తీర్ణంలో రైతులు ఏ పంట సాగు చేసారో ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

తుని సబ్‌డివిజన్‌లో ఈ-క్రాప్ వివరాలు

తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఈ ఏడాది రబీలో అపరాలు, వరి కలిపి తుని మండలంలోని 3592 ఎకరాలు, తొండంగి మండలంలోని 9440 ఎకరాలు, కోటనందూరులో 4046 ఎకరాలు, రౌతులపూడిలో 3076 ఎకరాలు, శంఖవరం మండలంలోని 1714 ఎకరాల్లో పంటలకు ఈ-క్రాప్ నమోదు చేసినట్టు తుని ఏడీఏ సుంకర బుల్లిబాబు తెలిపారు.

రైతులకు మేలు



మండలంలో ఈ ఏడాది అపరాలు, వరి కలిపి ఇప్పటి వరకూ 9440 ఎకరాలు ఈ-క్రాప్ నమోదు చేశాం. ఏటా దీనిపై రైతులకు అవగాహన పెరడంతో రైతులే దగ్గరుండి ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటున్నారు. గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు రైతుల వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో పంటలను ఈ-క్రాప్ నమోదు చేస్తున్నాం. ఈ విధానంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

– ఎస్.నరసింహం, వ్యవసాయశాఖ అధికారి, తొండంగి మండలం

అధికారులే నమోదు చేశారు



ఎకరం నా సొంత పొలంతో పాటు నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాను. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటకు ఈ-క్రాప్ నమోదు చేయించాను. పంట కోయగా వచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా సేకరించగా విక్రయించాను. ధాన్యం సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ చేశారు. గతంలో దళారులను నమ్మి సొమ్ము తీసుకోవడానికి ఇబ్బందులు పడే వాళ్లం. రబీపంటకు కూడా అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఈ-క్రాప్ నమోదు చేశారు.

– డి.సత్యనారానాయణ, రైతు, పి.ఇ.చిన్నాయపాలెం, తొండంగి మండలం

వేగ నియంత్రణకు స్పీడు బ్రేకర్లు

తుని: జాతీయ రహదారిపై స్థానిక డీ మార్టు వద్ద అప్రోచ్ రోడ్డులో వాహనాల వేగ నియంత్రణకు స్పీడు బేకర్లు ఏర్పాటు చేసినట్టు తుని పట్టణ సీఐ ఎం.నాగదుర్గారావు సోమవారం తెలిపారు. జాతీయ రహదారి నుంచి అప్రోచ్ రోడ్డుకు వెళ్లే వాహనాలు వేగంగా వెళ్లడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వాహనాలు వెళ్లడం వలన ప్రమాదాల్లో పలువురు తీవ్రంగా గాయపడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో డీమార్ట్ యాజమాన్యం సహకారంతో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు రాంగ్ రూట్‌లో ప్రయాణించవద్దని ఆయన కోరారు.

ఉచిత వైద్య శిబిరం

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు అపోలో సన్ షైన్ ఆసుపత్రి వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. సంపూర్ణ ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ డోలా సంజయ్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చెక్



శంఖవరంలో నూతన పైప్‌లైన్ వేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: స్థానిక మధ్య వీధిలో గత కొంత కాలంగా నెలకొన్న తాగునీటి సమస్యను ఎట్టకేలకు అధికారులు పరిష్కరించారు. ఈ ప్రాంతంలో పంచాయతీ పైప్ లైన్ ధ్వంసం కావడంతో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను స్థానికులు సర్పంచ్ బందిలి గనియమ్మ, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే స్పందించి నూతనంగా పైప్ లైన్ ఏర్పాటు చేసి ప్రజలకు తాగు నీరు అందించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: మాఘ అమావాస్యను పురస్కరించుకుని సోమవారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు గంగాధరబట్ల గంగబాబు, యనమండ్ర శర్మ, సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్, వ్రతపురోహితులు చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. స్థానిక ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడు పేరూరి గాంధీ, 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

ఘనంగా అరుణ హోమం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సూర్య భగవానుడికి సోమవారం అరుణహోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తుల సమక్షంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. మాఘ మాసంలో ప్రత్యేక పూజలు చేయించుకున్న భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ధర్మకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ధారపల్లి క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ధారపల్లిలో ఉమారామలింగేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు చేస్తున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధారపల్లి ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పండితుడు చీకట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శతనామావళి, పంచామృత అభిషేకం చేశారు. పెద్దిపాలెం, ఉత్తరకంచి, లంపకలోవ తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సనాతన ధర్మ పరిరక్షణ మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: అమావాస్యను పురస్కరించుకుని సోమవారం మండలంలోని తాళ్లూరులో రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బస్టాండ్లు మెరుగు పరచాలని వినతి



ఏలేశ్వరంలో ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో బస్టాండ్లను మెరుగు పరచాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపోలో డీఎం సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ యర్రవరం గ్రామంలోని ఏలేశ్వరం, పెద్దనాపల్లి గ్రామాలకు వెళ్లే బస్టాండ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. బస్టాండ్ల వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మరుగుదొడ్లు లేక మహిళలు అవస్థలు పడుతున్నారన్నారు. బస్టాండ్ల వద్ద తోపుడు బండ్లు పెట్టడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏనుగు ధర్మరాజు, గట్టెం వెంకటరమణ, గొల్లపూడి సత్యనారాయణ, రెడ్డి లోవరాజు, కురాకుల రాజా, బండారు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం

రౌతులపూడి: తమ గ్రామం చుట్టూ ఉన్న నల్లరాయి క్వారీలు, స్టోన్ క్రషర్ యజమానులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి గ్రామాభివృద్ధి సహకరించాలని మల్లంపేట గ్రామస్తులు డిమాండ్ చేశారు. మండలంలోని మల్లంపేట కమ్యునిటీ హాలులో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో క్వారీలు, స్టోన్‌క్రషర్ యజమానులతో సోమవారం సమావేశం నిర్వహించారు. గ్రామం మీదుగా లారీల్లో పెద్దపెద్ద బండరాళ్లను నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తుస్తున్నారన్నారు. అధిక లోడుతో పాటు మితిమీరిన వేగంగా లారీలు వెళుతున్నాయని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందారు. లారీల రాకపోకలతో గ్రామంలో శబ్ద, వాయు కాలుష్యం జరుగుతోందన్నారు. క్వారీలు, స్టోన్ క్రషర్ నిర్వాహకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రవాణా సాగించుకోవాలన్నారు. కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలని, గోతులు పడ్డ రహదారిని వెంటనే పూడ్చాలని, గ్రామంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, గ్రామ నాయకులు పోలుపర్తి తాతాజీ, శ్రీరంరెడ్డి శ్రీను, సోమినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బోర్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలి



రేంజర్‌కు దుర్గారామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన రైతులు

ఏలేశ్వరం: మండలంలోని తూర్పులక్ష్మీపురం గ్రామంలోని కొండపోడు, రెవెన్యూ భూముల్లో బోర్లు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని గిరిజన రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్ ఆధ్వర్యంలో రేంజర్ దుర్గారామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గతంలో గిరిజనులకు ప్రభుత్వం కొండపోడు, రెవెన్యూ కలిసి ఉన్న భూములకు పట్టాలు ఇచ్చిందన్నారు. ఈ భూముల్లో వ్యవసాయం నిమిత్తం బోర్లు నిర్మాణానికి అటవీశాఖ అధికారులను కోరామన్నారు. బోర్లు నిర్మాణానికి అనుమతులు ఇస్తే పంటలను సాగు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మన్నేపల్లి సత్యనారాయణ, బొడ్డు సూర్యారావు, మురద వేట్లయ్య, సోమాల నాగేశ్వరరావు, మన్నేపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాల వెల్లువతో బహుళ ప్రయోజనాలు



దొండవాకలో పాడి రైతులకు జగనన్న పాలవెల్లువపై అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ డాక్టర్ గోపి

తుని రూరల్: జగనన్న పాల వెల్లువ పథకంతో పాడి రైతులకు మంచి గిట్టుబాటు ధర, రాయితీలు, ఉచిత బీమా వంటి బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ఎన్.సూరవరం వెటర్నరీ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ ఎన్.గోపి అన్నారు. మండలంలోని కేఓ మల్లవరం, రాపాక, దొండవాక గ్రామాల్లో పాడి రైతులకు అమూల్ డెయిరీ అందించనున్న రాయితీలు, గిట్టుబాటు ధర్మపై సోమవారం ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ గోపి మాట్లాడుతూ పాడి రైతులకు ఉచితంగా వ్యక్తిగత ప్రమాద బీమా, పశు బీమా, రాయితీపై దాణా సరఫరా వంటి ప్రయోజనాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఏప్రిల్ మొదట వారం నుంచి పాల సేకరణ చేస్తున్నట్టు వెల్లడించారు. రైతులు జగనన్న పాలవెల్లువను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమూల్ డెయిరీ కల్పిస్తున్న రాయితీలను వివరించారు. సర్పంచ్‌లు దొంక సత్యవతి, గూడెపు గౌరీపార్వతి, లంక లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు దొంక వెంకట బెనర్జీ, లంక సత్యనారాయణ, పంచాతీ కార్యదర్శులు ఎం.శివబాబు, పైల శివ, ఎస్వీ.ఆదిత్య, వీఏఏలు, పాడి రైతులు పాల్గొన్నారు.

వంద శాతం ఈ-కేవైసీ నమోదు చేయాలి



కేఎస్ కొత్తూరులో ఈ-కేవైసీ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ బుల్లిబాబు

కోటనందూరు: రైతులు సాగు చేసిన రబీ పంటలకు మరో రెండు రోజుల్లో ఈ-కేవైసీ నమోదును 100 శాతం పూర్తి చేయాలని ఏడీఏ సుంకర బుల్లిబాబు ఆదేశించారు. మండలంలో పాతకొట్టాం, కేఎస్ కొత్తూరు, కేఈ చిన్నయ్యపాలెం, కొత్తకొట్టాం గ్రామాల్లో జరుగుతున్న రబీ ఈ-కేవైసీ నమోదును సోమవారం ఆయన పరిశీలించారు. నేరుగా రైతుల చెంతకెళ్లి పంట సాగు వివరాలు నమోదు చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏడీఏ బుల్లిబాబు మాట్లాడుతూ మండలంలోని 17 పంచాయతీల పరిధిలో 4,106 ఎకరాల పంట నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటివరకూ 3,532 ఎకరాలకు ఈ-కేవైసీ నమోదు పూర్తయిందన్నారు. మిగిలిన 574 ఎకరాల్లో పంట నమోదుకు చర్యలు చేపట్టామన్నారు. బొద్దవరం, జగన్నాథపురం, కోటనందూరు గ్రామాల్లో ఈ-కేవైసీ నమోదు కార్యక్రమాన్ని ఏఓ కే చంద్రశేఖర్ పరిశీలించారు. వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన శాంతికుమారిని అభినందిస్తున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ బిందుమాధవి

గోకవరం: జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో మండలంలోని మల్లవరం హైస్కూల్ విద్యార్థిని ప్రథమ స్థానం సాధించింది. వివరాల్లోకి వెళితే... బాలికా దినోత్సవం సందర్భంగా గత నెల 24న రాజమహేంద్రవరంలోని వీటీ హైస్కూల్‌లో తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో మల్లవరం హైస్కూల్ విద్యార్థిని ఆర్.శాంతికుమారి ప్రథమ స్థానంలో నిలిచింది. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆమెకు బహుమతిని అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థినితో పాటు ఆమెకు గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయురాలు ఝాన్సీని ఎంఈఓ బి.గౌరమ్మ, హెచ్ఎం ఎస్వీవీ సత్యనారాయణ తదితరులు అభినందించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



రంపయర్రంపాలెంలో నువ్వుల పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

గోకవరం: నువ్వుల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రంపచోడవరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.చిరంజీవి అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న నువ్వుల పంటను సోమవారం ఆయన పరిశీలించారు. మొలక శాతం, తెగుళ్లను గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. పంట పురుగుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఎరువుల వాడకం తగ్గించి పచ్చిరొట్ట విత్తనాలు సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో డీవైఈఓ తనిఖీలు



దానవాయిపేట హైస్కూల్లో రికార్డులు పరిశీలిస్తున్న డీవైఈఓ సుభద్ర

తొండంగి: మండలంలోని అద్దరిపేట, దానవాయిపేట, తొండంగి హైస్కూళ్లను సోమవారం డీవైఈఓ సుభద్ర తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్, వర్క్‌బుక్‌లు, నోట్ బుక్‌ల కరెక్షన్లు పూర్తికావాలన్నారు. ఇప్పటికే ఇవన్నీ పూర్తయితే గూగల్ ఫాం ద్వారా తెలిపారన్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సిలబస్‌లకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఆమె వెంట ఎంఈఓ షేక్‌బాబ్జీ, విద్యాశాఖ సిబ్బంది ఉన్నారు.

25న కాకినాడలో ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాప్

ప్రత్తిపాడు: కాకినాడ రామారావుపేట లూథరన్ చర్చి సమావేశ హాలు ఆవరణలో ఈనెల 25న అంబేద్కర్ ఆలోచన ఫౌండేషన్ (ఏఏఎఫ్) ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు ఏఏఎఫ్ ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షుడు, న్యాయవాది పిల్లి బలరాముడు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఒకే లక్ష్యం–ఒకే ఎజెండా నినాదంతో ఈ వర్క్ షాపు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సుమారు ఏడు వేల మంది ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులున్నారని, వీరికి జ్యుడీషియరీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నమెంట్ ప్లీడరు (జీపీ), ఏజీపీ, పీపీ, ఏపీపీ వంటి నామినేటెడ్ పదవులకు ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులను ఎంపిక చేయడం లేదన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు సంఘటితంగా రాబోయే ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఏఏఎఫ్ ఎంపిక చేసిన వారి గెలుపే లక్ష్యంగా ప్రణాళికను రూపొందించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన వివరించారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు హాజరుకావాలని ఆయన కోరారు. సమావేశంలో ఏఏఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ బత్తిన సింహాచలం, జాయింట్ కన్వీనర్ రాయి శ్రీనివాసరావు, కాకినాడ పార్లమెంట్ మహిళా కన్వీనర్ వై.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై బాలికలకు అవగాహన



తుని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రమేష్‌రాజును సత్కరిస్తున్న అధ్యాపకులు

తుని: వ్యక్తిత్వ వికాసం, అభివృద్ధి, కౌమారదశలో విద్యార్థులు పాటించాల్సిన సూత్రాలపై సోమవారం వ్యక్తిత్వ వికాస నిపుణుడు రమేష్ రాజు బాలికలకు అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.సుజాత ఆధ్వర్యంలో 300 మంది బాలికలకు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. మనసు ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలని, పరీక్షలు అంటే ఆందోళన చెందవద్దన్నారు. సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం రమేష్ రాజును కళాశాల అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో ఎస్సీ పేటలో మెయిన్‌రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.30 లక్షలతో 420 మీటర్ల మేరకు సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు సోమవారం రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రత్యేక చొరవతో ఈ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఎస్సీపేట వాసులతో పాటు కొత్త సూరవరం, పాత సూరవరం ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గంటా చక్రరావు, వంగలపూడి కృష్ణారావు, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.